



- ప్రచారం కోసం ప్రధాన పార్టీల కొత్త ప్లాన్
- కాంగ్రెస్, బీజేపీల ప్రచార అస్త్రంగా సోషల్ మీడియా
- జిల్లావ్యాప్తంగా గల్లీగల్లీన వాట్సాప్ గ్రూపులు
- నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఇన్‌చార్జిల నియామకం

నిర్మల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తమ అభ్యర్థుల ప్రచారజోరు కోసం కాంగ్రెస్, బీజేపీలు కొత్త ట్రెండ్ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాయి. జిల్లాలో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా డీలా పడిపోయిన నేపథ్యంలో.. కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా సోషల్ మీడియాను తమ అస్త్రాలుగా మలుచుకుని ఆ దిశగా కార్యాచరణ చేపట్టాయి. ఇప్పటికే ఈ రెండు పార్టీలు నియోజకవర్గాల స్థాయిలో సోషల్ మీడియా కార్యకర్తల సమావేశాలను నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశాయి. కొద్దిరోజుల క్రితం బీజేపీకి చెందిన సోషల్‌మీడియా రాష్ట్ర ఇన్‌చార్జీ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రత్యేకసమావేశాలు నిర్వహించి రాబోయే ఎన్నికల్లో చేపట్టే ప్రచారంపై కార్యకర్తలకు మార్గదర్శకాలను జారీ చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు నియోజకవర్గస్థాయిలో కొంతమంది యూత్ కార్యకర్తలకు సోషల్ మీడియా నిర్వహణ బాధ్యతలను అప్పగించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగానే ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మూడు నియోజకవర్గాల్లో సోషల్ మీడియా ఇన్‌చార్జీలను సైతం నియమించినట్లు చెబుతున్నారు. అటు కాంగ్రెస్.. ఇటు బీజేపీలు పట్టణ ప్రాంతాల్లోని గల్లీల్లోనూ, గ్రామాల్లోనూ సోషల్ మీడియా ఇన్‌చార్జీలను నియమించుకునే దిశగా కసరత్తు మొదలుపెట్టాయని అంటున్నారు. సోషల్ మీడియాతో పాటు రాజకీయ అంశాలపైనా పార్టీ విధానాలపైనా అవగాహన ఉన్న వారిని ఇన్‌చార్జీలుగా నియమించేందుకు కార్యాచరణ చేపట్టాయంటున్నారు. గ్రామాల్లో ఉన్న మహిళ సంఘాలు, యూత్‌క్లబ్‌లు, కులసంఘాలు, అభివృద్ధి కమిటీలను లక్ష్యంగా చేసుకొని మొదట వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేయనున్నారు. ఈ గ్రూపుల్లో ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చుకొని వారికి ప్రతీరోజూ తమ పార్టీ కార్యకలాపాలు.. అలాగే ఎదుటి పార్టీ వైఫల్యాలను చాటింగ్ ద్వారా వివరించనున్నట్లు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎక్కువగా హైలెట్ చేసేందుకు ఈ వాట్సాప్ గ్రూపులను ఉపయోగించుకోవాలని భావిస్తున్నాయి. వాట్సాప్‌తో పాటు ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, ఎక్స్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను కూడా వేదికగా చేసుకొని ఇక ప్రచారం చేపట్టేందుకు ఈ రెండు పార్టీలు సిద్ధమవుతున్నాయి. కాగా మొన్నటి ఎన్నికల ఓటమితో బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే కోలుకోలేకపోతుండడం.. అలాగే ఆ పార్టీకి చెందిన సీనియర్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా కాంగ్రెస్‌లో చేరిపోతుండడంతో రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ ప్రచారంలో వెనకబడిపోవడం ఖాయమంటున్నారు.

అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీల తరఫున ప్రచారం చేపట్టేందు కోసం ప్రత్యేకంగా మారుపేర్లతో యూట్యూబ్ ఛానెల్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు.

● అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు లోక్‌సభ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ సోషల్ మీడియా ప్రచారాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ఆయా నియోజకవర్గంలో కేంద్రప్రభుత్వం ద్వారా అమలైన సంక్షేమ పథకాలతో పాటు స్థానిక బీజేపీ నేతల కార్యకలాపాలు, పార్టీపరంగా జాతీయస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతస్థాయిలో ప్రచారం చేపట్టాలని బీజేపీ సిద్ధమవుతోంది. అలాగే రాష్ట్రంలోని అగ్రనేతలైన బండిసంజయ్, ధర్మపురి అర్వింద్, రాజాసింగ్, కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఈటెల రాజేందర్ వంటి వారి ప్రెస్‌మీట్‌లను, సభలు, సమావేశాల్లో వారు మాట్లాడిన ప్రసంగాలను సోషల్‌మీడియా ద్వారా విస్తృతస్థాయిలో ప్రచారం చేసి జనం మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేయబోతుంది. కాంగ్రెస్ పార్టీ సైతం ఇదే తరహా సోషల్ మీడియా ప్రసారాన్ని కొనసాగిస్తూనే జాతీయస్థాయి నేతలైన రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల ప్రసంగాలను, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అద్దంకి దయాకర్ లాంటి నేతల ప్రసంగాలను హైలెట్ చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేయబోతుంది. ఇందుకు అనుగుణంగానే కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జీల ద్వారా ఇప్పటికే అనేక ఎపిసోడ్‌లను అందుబాటులోకి తెచ్చిందని అంటున్నారు. దశల వారీగా ఎన్నికల ప్రచారం ముగిసే వరకు సోషల్ మీడియా ద్వారా జనానికి మరింత చేరువై గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా పావులు కదుపుతోంది.



ఘనంగా రుక్మిణీమాత వార్షికోత్సవం



ఆలయంలో సప్తాహం నిర్వహిస్తున్న దృశ్యం

తానూర్, మార్చి 29 : మండలంలోని భోసి గ్రామంలోని విఠలేశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. గత 30ఏళ్లుగా సప్తః కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు వీడీసీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావు తెలిపారు. గ్రామస్తులంతా వార్షికోత్సవంలో పాల్గొని కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషిచేస్తారని, ప్రజలందరు భక్తి మార్గంలో వెళ్లి చెడుమార్గాలకు దూరంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాందాస్ గురుజీ వాయికర్, గంగాధర్ పాటిల్, లింబా మృదుంగకర్, గోరక్ జాదవ్ పర్బని, శివనత్‌భోసి, గ్రామస్థులు ఎస్‌మల్లయ్య, పి. మహేందర్, మాజీ సర్పంచ్ ఆనంద్, మాజజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎం. సాయన్న, టి. ముత్యం, పండరి రాజుకుమార్, తదితరులున్నారు.

అంజన్న స్వాములకు ముస్లిం సోదరుని భిక్ష



కుంటాలలో భిక్ష ఏర్పాటు చేసిన ఖదీర్‌ను సన్మానిస్తున్న అంజన్న స్వాములు

కుంటాల, మార్చి, 29 : మండల కేంద్రం కుంటాలలో శుక్రవారం హనుమాన్ దీక్ష చేపట్టిన దాదాపు 50 మంది స్వాములకు దౌనెల్లి గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు షేక్‌ఖదీర్ బిక్షను ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం పురస్కరించుకొని అంజన్న స్వాములకు ఒకపూట భోజనం ఏర్పాటు చేయాలనే తపనతో ఈ బిక్షను ఏర్పాటు చేయడం జరిగిందని ఖదీర్ తెలిపారు. మండల కేంద్రం కుంటాల స్థానిక వీర హనుమాన్ ఆలయంలో ఈ భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశాడు. ముస్లిం సోదరుడు అంజన్న స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఖదీర్‌ను అంజన్న స్వాములు శాలువాతో సన్మానించారు.

చామన్‌పెల్లిలో ఉచిత వైద్య శిబిరం

లక్ష్మణచాంద, మార్చి 29 : మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక పరివర్తన మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఒక స్పెషాలిటీ ఆసుపత్రి బృందం పలువురిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకుమార్ (ఎంఎస్ ఆర్థోపెడిక్), శ్రీనివాస్ (ఎండీ ఫార్మనాలజిస్ట్), ఎంపీటీసీ అనిత సురేష్, వీడీసీ చైర్మన్ సురకంటి రాజారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి గంగారెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు, అడ్వకేట్ మునబర్తి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సరిహద్దు తనిఖీల్లో

రూ. 3 లక్షలను పట్టుకున్న పోలీసులు



తెలంగాణ సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సారంగాపూర్, మార్చి 29 : మండలంలో గల సిరిపెల్లి గ్రామ సమీపంలో ఉన్నటువంటి తెలంగాణ సరిహద్దులో శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కుభీర్ నుండి బజార్‌హత్నూర్ వైపు వెళ్తున్న కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 3 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రూ. 3 లక్షలను డబ్బులను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి గ్రీవెన్స్ కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఈ వాహనాల తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

డాక్టర్ మనీషాకు ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ మనీషా

నిర్మల్ కల్చరల్, మార్చి 29 : నిర్మల్ జిల్లాలో క్షయవ్యాధి నివారణలో మెరుగైన వైద్య సేవలు అందించిన బంగల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు మనీషాకు శుక్రవారం జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అంకిత భావంతో పని చేసేవారికి గుర్తింపు లభిస్తుందని ధనరాజ్ అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన

సాకెర గ్రామ బీజేపీ, బీఆర్ఎస్ యువకులు

నిర్మల్ రూరల్, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీకి చెందిన వార్డు మెంబర్ రేగుంట నవీన్, 50 మంది యువకులు శుక్రవారం శివరాం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసేంత వరకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపనిచ్చారు. గత కుటుంబ పాలనలో విసిగిపోయిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న పాలనకు ఆకర్షితులై పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ తాజా మాజీ సర్పంచ్ రాజ నర్సింగహారెడ్డి, సాకెర ఉప సర్పంచ్ సతీష్ రావు, ఎస్. నవీన్, ప్రవీణ్‌రావు, తదితరులు ఉన్నారు.

మొర్రి పండ్లకు వెళ్లి ప్రమాదానికి గురైన గిరిజన మహిళ



ఉట్నూర్, మార్చి 29 : ఉట్నూర్ మండలంలోని పెద్ద సుద్దగూడకు చెందిన గిరిజన మహిళ గిరజబాయి శుక్రవారం మొర్రిపండ్ల సేకరణకు వెళ్లి ప్రమాదానికి గురైంది. చెట్టు ఎక్కి పండ్లు సేకరిస్తుండగా జారి పడింది. చెట్టు కింద ఉన్న బండరాయిపై పడడంతో తలకు భారీగాయం కావడంతో ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందించారు. గిరిజబాయి వైద్యం అందుకుంటుండగా ఆసుపత్రికి చేరుకొని ఎంపీపీ జైవంత్‌రావు పరామర్శించారు.

నేరరహిత సమాజం కోసమే కార్డన్‌సెర్చ్

» ముథోల్ సీఐ మల్లేష్ » సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం

ముథోల్, మార్చి 29 : నేరరహిత సమాజం కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముథోల్ సీఐ జి. మల్లేష్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున పోలీసుశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు. సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్ ద్వారా ఎవరికి ఓటీపీలు చెప్పకూడదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఎవరిపై రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయకూడదన్నారు. కార్డెన్ సెర్చ్‌లో సరైన వాహనపత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 55, త్రి విలర్స్ 6లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు, రాజు, శివ, గణేష్, 20 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



కార్డన్‌సెర్చ్ నిర్వహించి, మాట్లాడుతున్న సీఐ మల్లేష్

ప్రతీ వాహనదారుడు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

ఖానాపూర్ సీఐ సైదారావు



సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు

ఖానాపూర్, మార్చి 29 : ప్రతి వాహనదారుడు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో శుక్రవారం ఉదయం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో తనిఖీలు నిర్వహించి వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని 41 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, 7 ఆటోలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు సీఐ సైదారావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. సమాజంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ లింబాద్రి, పెంబి ఎస్సై శంకర్, కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి, దస్తూరాబాద్ ఎస్సై, పలువురు ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి చందాలివ్వండి

జిల్లా అధ్యక్షుడు కె. అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, మార్చి 29 : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు చందాలిచ్చి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మైక్రో డొనేట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్నికల ప్రచార వ్యూహాలపై శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బీజేపీ ట్రిపుల్ టార్గెట్‌తో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపు లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పరిస్థితులను అనుకూలంగా మార్చుకునేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు ప్రచార అస్త్రాలుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి మోదీ ప్రవేశపెట్టిన పథకాలు వివరించాలన్నారు. ప్రతి ఓటరును కలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, నాయకులు రాంనాథ్, సామ రాజేశ్వర్ రెడ్డి, మేడిసెమ్మె రాజు, శ్రావణ్ రెడ్డి, కే. వినాయక్ రెడ్డి, సాదం అరవింద్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.



మైక్రో డొనేట్ ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కుంటాలలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న రమణరావు

కుంటాల, మార్చి, 29 : మండల కేంద్రం కుంటాల నిరుపేద కుటుంబానికి చెందిన వన్నెల సావిత్రి బాయి గత కొద్ది రోజుల నుంచి గుండెకు సంబందించిన వ్యాధితో బాధపడుతుంది. వైద్య పరీక్షల కోసం నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి వెళ్లగా గుండెకు రంధ్రం ఉందని సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. చికిత్స కొరకు రూ. లక్ష ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్న తరుణంలో గ్రామానికి చెందిన గొట్టుముక్కుల రమణ రావు రూ. 5 వేలు, సృజన విద్యానిలయం ప్రిన్సిపాల్ గంగన్న రూ. 5 వేలు అందజేశారు. ఇమె భర్త కూలీపని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. నిరుపేద కుటుంబం కావడంతో లక్ష రూపాయలు ఎక్కడి నుండి తేవాలని ఆందోళనకు గురవుతున్నారు. మరి కొందరు దాతలు ఆర్థికసాయం అందజేస్తే బాగుంటుందని అన్నారు.

కాంట్రాక్ట్ సీఆర్టీల

వేతనాలు వెంటనే చెల్లించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 29 : ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే కాంట్రాక్ట్ సీఆర్టీల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఏడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మొత్తం జిల్లాలో 143 మంది సీఆర్టీలు పని చేస్తున్నారన్నారు. అందుకు సంబంధించిన బడ్జెట్ విడుదలైనా జాప్యం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ చొరవచూపి వేతనాలు చెల్లించేందుకు చర్య తీసుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ విజయవంతం చేయండి

నిర్మల్ కల్చరల్, మార్చి 29 : ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ నిరసిస్తూ ఈ నెల 31న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని నిర్మల్ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ సయ్యద్ హైదర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాంలీలా మైదానంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో పేద ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందించడంలో కేజ్రీవాల్ ముందున్నారన్నారు. ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీని ఎదుర్కోవడం కష్టమని భావించి బీజేపీ కేజ్రీవాల్‌పై కేసులు బనాయించారని ఆరోపించారు.



ఆదిలాబాద్‌లో అడవి ద్రాక్షలు వచ్చేశాయ్!

● ఉట్నూర్‌లో విక్రయిస్తున్న ఆదివాసీ మహిళలు


ఉట్నూర్‌లో మొర్రిపండ్లు విక్రయిస్తున్న ఆదివాసీ గిరిజన మహిళ

ఉట్నూర్, మార్చి 29: అడవులను నమ్ముకుని, అడవులే ఆయువు పట్టుగా జీవితాలు కొనసాగిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనులకు అటవీ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. అడవి ద్రాక్షలుగా నానుడి ఉన్న మొర్రి పండ్లు లభిస్తుండడంతో ఆదివాసీ గిరిజన మహిళలు ఉట్నూర్ పట్టణంలో విక్రయిస్తున్నారు.అడవుల్లో సంచారం చేస్తూ అటవీ ఉత్పత్తులను సేకరిస్తున్న గిరిజనులు మండల కేంద్రాలకు చేరుకొని తమ ఉత్పత్తులను అమ్ముకుంటారు. ప్రతియేటా వేసవి కాలంలో ప్రకృతి ఆధారంగా అడవుల్లో లభించే మొర్రి పండ్లను చిన్న టీ గ్లాస్‌ల కొలతతో రూ.10కి ఒక గ్లాసు అమ్ముతుండడంతో ప్రజలు అమితంగా ఇష్టంతో కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో ఉట్నూర్ మండలంలోని వంకతుమ్మ, ఉమాపతి కుంట, శుద్ధగూడ, మత్తడి గూడ, గంగాపూర్‌గూడ, రాజులమడుగు తదితర మారుమూల అటవీ ప్రాంతాలలో జీవిస్తున్న గిరిజనులు అడవుల్లో పురుషుల సహాయంతో చెట్ల పై నుంచి పండ్లు చెడిపోకుండా గంపల్లో తీసుకువచ్చి ఉట్నూర్‌లో విక్రయిస్తున్నారు. పండ్ల కంటే సార పలుకులకు ఎక్కువ ధర వస్తుందని కాని పండ్లు సేకరించి ఎండకు ఎండబెట్టి, వాటిని పగులగొట్టి కిరాణ కొట్టులో విక్రయిస్తే చాలీచాలని ధరలు వస్తాయని, అందుకే శ్రమపడడం కంటే సునాయసంగా పండ్లు విక్రయించడం ద్వారా కూడా అంతే డబ్బులు వస్తున్నాయని ఆదివాసీ మహిళలు పేర్కొంటున్నారు.

ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీని ప్రకటించిన కేటీఆర్

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :


పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు. ఈ కమిటీలో రమాదేవి, ఎ.శ్యాంసుందర్, విలాశ్ గాదేవర్, కిరణ్ కమ్మేవర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు.


















గిమ్మాలో నిర్మించిన రేణుకామాత ఎల్లమ్మ ఆలయం

నేడు గిమ్మా(కె) గ్రామంలో జిల్లేడు గణపతి రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో వేడుకలు

జైనథ్, మార్చి 29 : జైనథ్ మండలంలోని గిమ్మా(కె) గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లేడు గణపతి రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం కలశస్థాపన, సర్వాంగన హోమం, మహాస్నానం తదితర ప్రత్యేకపూజలు నిర్వహించారు. నేడు శనివారం గిమ్మా(కె) జిల్లేడు గణపతి రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించడంతో పాటు ఆలయ ఆవరణలో జాతర కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు భక్తులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గిమ్మా(కె) గ్రామస్థులు కోరుతున్నారు.

అందరూ ధర్మ మార్గంలో నడవాలి



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న విష్ణు మహరాజ్

ఇంద్రవెల్లి, మార్చి 29 : ప్రతీ ఒక్కరు ధర్మమార్గంలో నడవాలని విష్ణు మహరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తహం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన హాజరై భక్తులద్దేశించి మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ధర్మం ఎంతో అవసరమని, ప్రతీ ఒక్కరూ అధర్మాన్ని వీడి సత్యమార్గంలో నడవాలని కాంక్షించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలన్నారు. హిందూ ధర్మంలో భగవంతుడి ఆరాధన ఎంతో కీలకమని, ప్రతి ఆలయంలో నిత్యంపూజలు జరుగుతుంటే ఆ గ్రామం ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గిత్తే మారుతి మహరాజ్, గ్రామపెద్దలు ముస్లే కేశవ్, పడ్ విశ్వనాథ్, దేవిదాస్, తదతరులు పాల్గొన్నారు.

పిప్పల్‌గావ్‌లో నేటి నుంచి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

జైనథ్, మార్చి 29 : జైనథ్ మండలంలోని పిప్పల్‌గావ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రత్యేక పూజలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయన్నారు. మొదటిరోజు ఆలయంలో వివిధ జెండాలతో ప్రత్యేకహోమం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పిప్పల్‌గావ్ గ్రామస్థులు తెలిపారు. వచ్చే నెల ఏప్రిల్ 1వ తేదీన శాస్త్రబద్ధంగా హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠిచనున్నారు. ఈ కార్యక్రమం ఆదిలాబాద్ గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి అధ్వర్యంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల మహి ళలు భక్తులు హనుమాన్ దీక్షాపరులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 29: ఇంటి, వ్యాపార సముదాయాల పన్నులను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వ్యాపారసముదాయాల్లో సిబ్బందితో కలిసి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల31 వరకు పన్నులు చెల్లించాలని లేనిపక్షంలో ఏప్రిల్1 నుంచి 20శాతం ఫైన్‌కట్టాల్సి ఉంటుంద న్నారు. ప్రజలుఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ ఆనందం, ఆర్ఐ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారంగపాణి, బిల్ కలెక్టర్ నాగేందర్, వార్డు అధికారి భద్రయ్య, సిబ్బంది వంశీ, ఉదయ్ ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది

ఆసిఫాబాద్, మార్చి 29 టీవీవీపీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లిం చాలని ఏప్రిల్ 1నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు దివాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో ధర్నా నిర్వహించి డాక్టర్ రాణాకు వినతిపత్రం అందజేశారు. వెంటనే శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లేష్, సత్తార్‌బేగ్, లక్ష్మణ్, హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో ప్రాంతంలో ఇరుక్కుపోయిన వాహనాలు

జైనూర్, మార్చి 29: మండలంలోని భూసిమెట్ట ఘాట్ పరిసర ప్రాంతంలో శుక్రవారం వాహనాలు ఇరుక్కు పోయాయి. దీంతో ఈ మార్గంలో రాపోకలకు ఇబ్బందులు కలిగింది. పెద్దవాహనాలు రాకపోకలకు వీలులేకుండా పోవడంతో వాహనాలు నిలిచిపోయ్యాయి. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రూట్‌ను క్లియర్ చేశారు. భూసిమెట్ట ఘాట్ ప్రాంతంలో రోడ్డు చిన్నగా ఉండడంతో నిత్యం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతోంది. తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది.



భూసిమెట్ట ఘాట్‌లో నిలిచిపోయిన వాహనాలు

ఆరు నెలలుగా మరమ్మతులకు నోచుకోని వంతెన

● అధికారుల సమన్వయ లోపం ● తెలంగాణ-మహారాష్ట్ర ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కూలిన వంతెన

తలమడుగు, మార్చి 29: అధికారుల సమన్వయ లోపంతో తెలంగాణ మహారాష్ట్ర ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వరదలకు వంతెన కూలీ ఆరు నెలలు అవుతున్న ఇప్పటి వరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టక పోవడంతో రెండు రాష్ట్రాల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తలమడుగు మండలంలోని లక్ష్మీంపూర్ చెక్‌పోస్టు సమీపంలో గత వర్షాకాలంలో భారీవర్షాలు కురవడంతో అంతరాష్ట్ర రహదారిపై ఉన్న వంతెన కూలిపోయి దాదాపు ఆరునెలలు గడుస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో రెండు రాష్ట్రాల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డుతోనే రాకపోకలన సాగిస్తున్నారు. వంతెన సమీపంలో అటవీశాఖ సంబంధించిన వృక్షాలు ఉండడంతో ఆ వృక్షాలను తొలగించేందుకు అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్ వంతెన నిర్మాణ పనులు చేపట్టడం లేదు. అధికారుల సమన్వయ లోపంతో రెండురాష్ట్రాల ప్రయాణికులకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోక పోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా రాత్రిపూట అటుగా వెళ్లాలంటేనే ప్రయాణికులు బలవంతులకు గురవు తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారుల స్పందించి అంతరాష్ట్ర రహదారిపై కూలిన వంతెన నిర్మాణంలో త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కూలిన వంతెనతో పక్కదారి గుండా వెళుతున్న వాహనం

విభేదాలు లేవు.. కలిసి పని చేస్తాం

● మూడోసారి మోదీని ప్రధాని చేస్తాం!
● ఆదిలాబాద్ బీజేపీ నాయకులు

ఉట్నూర్, మార్చి 29: బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఖరారులో ఎలాంటి విభేధాలు లేవని, కలిసి కట్టుగా పనిచేసి మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిగా చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, బీజేపీ అభ్యర్థి గోడంనగేష్‌లు ప్రకటించారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముగ్గురు నేతలు మాట్లాడారు. బీజేపీ టికెట్టు రేసులో ఎంతో మంది ఉన్నప్పటికీ మంచి అనుభవజ్ఞుడైన ఆదివాసీ నాయకుడు గోడంనగేష్‌ను అభ్యర్థిగా ఖరారు చేశామని భారీ మెజార్టీతో ఈ ఎన్నికల్లో విజయం సాధించి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి నగేష్‌ను ప్రధానమంత్రి మోడీకి బహుమానంగా ఇవ్వనున్నామని అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీలో తాము ముగ్గురం కలిసి పనిచేసిన అనుభవం ఉందని ప్రస్థుతం బీజేపీలో కూడా తాము కలిసికట్టుగా పని చేసి ఆదిలాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇటీవల ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రికి పార్లమెంట్లో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి లిఖిత పూర్వకంగా ఇవ్వడం జరిగిందని, ఎన్నికలయ్యాక జిల్లా ప్రజల ఆశల మేరకు అన్ని కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ, ఆర్మూర్ ఆదిలాబాద్ రైలు మార్గం లాంటివి ఎన్నో ప్రధానిదృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరు గల్లీలో ఎవరు లీడర్ ఉన్నా దేశ రాజధాని ఢిల్లీలో నరేంద్రమోదీ ప్రధానిగా ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని, గత ప్రభుత్వం పైనే విమర్శలు చేస్తూకాలం గడిపేస్తుందన్నారు. భారత రాష్ట్ర సమితి ఎంపీ అభ్యర్థులు సైతం బి ఫారం ఇచ్చిన తాము పోటీ చేయలేమని వెళ్లి పోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఇంకా అధికారంలో ఉన్న భావనతో అహంకార ధోరణితోనే ఉన్నారని విమర్శించారు. అహంకారం తగ్గించుకొని చేసిన అవినీతి భాగోతాన్ని మరిచి పోయి నీతివంతులుగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పతనం వారి అహంకారంతోనే అయిందని, రానున్న రోజుల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ మాట్లాడుతూ అధిష్ఠానం ప్రకటించిన ఎంపీ అభ్యర్థి నగేష్ విజయం కోసం తాను మనస్ఫూర్తిగా పని చేస్తానని, మోదీని మూడోసారి ప్రధానిగా చూడడమే బీజేపీ నాయకుల లక్ష్యమని అన్నారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడంనగేష్ మాట్లాడుతూ భారతదేశంలో సుపరిపాలన అందిస్తూ మోదీ నాయకత్వంలో పదేళ్లు పూర్తి చేసుకొని ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా ఉన్న మోదీని మూడోసారి ప్రధాని చేయడమే ప్రజలందరి లక్ష్యమన్నారు. ప్రజల లక్ష్యం మేరకు తాను పనిచేస్తానని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, ఎంపీ సోయం బాపురావుతో కలిసి ఉమ్మడి జిల్లాలోని బీజేపీ ఎమ్మెల్యేలు నాయకులతో కలుసుకొని తన విజయం కోసం శ్రమిస్తానన్నారు. 2029 నాటికి తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 9న ఇచ్చిన వందరోజుల హామీలతో మోసగించడమేనని అన్నారు. బీఆర్ఎస్ పతనమై చేరుకొని దీనస్థితిలో ఉందన్నారు. రాథోడ్‌రితేష్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మాజీ ఎంపీపీ ఆడే దన్‌లాల్‌నాయక్, శ్రీరామ్‌నాయక్, బింగి వెంకటేశ్, రాజేశ్వర్, లింగౌడ్, కాల్వరవి తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, ఎంపీ అభ్యర్థి గోడంనగేష్, మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్‌లు

తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

● ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



ఇచ్చోడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గొడం నగేష్

ఇచ్చోడ, మార్చి 29: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యం అవుతుందని బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అభినందన్ గార్డెన్స్‌లో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, నాయకులు భీంరెడ్డి, చంద్రశేఖర్, మాదవ్‌రావ్ ఆమ్లె, జడ్పీటీసీ రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎంపీ అభ్యర్థికి ఘన సన్మానం

ఉట్నూర్, మార్చి 29: బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను ఉట్నూర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పార్టీ అభ్యర్థిగా తొలిసారిగా ఉట్నూర్ రావడంతో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, రాథోడ్‌రితేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, సాడిగే రాజేశ్వర్, ధన్‌లాల్, లింగగౌడ్, బింగివెంకటేశ్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతు రానున్న రోజుల్లో రాథోడ్‌రమేష్‌కు కేంద్రంలో మంచి అవకాశం కల్పించబోతుందని పార్టీ శ్రేణులు ఎవరు కూడా నిరాశ చెందకుండా బీజేపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని కోరారు. క్రమశిక్షణ గల బీజేపీ నాయకులు కార్యకర్తలు అందరు పార్టీకి విదేయులుగా పని చేస్తారని రాథోడ్‌రమేష్ అన్నారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ అభ్యర్థి గోడంనగేష్ ప్రకటించారు.

బీజేపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురపాటి రమేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కురపాటి రమేష్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 29 : పదేళ్ల బీజేపీలో పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ధ్వంసం అయిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురపాటి రమేష్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థను విచ్చినం చేసిందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. రైతు, కూలీ, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా పాలన సాగిందన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాల పేరిటా చిచ్చు పెట్టిందని ఆరోపించారు. ఇలాంటి పార్టీని ఓడించడంలో కార్మికులు, కర్షకులు, సామాన్య ప్రజలు ముందుకు రావాలని కోరారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

కెరమెరి, మార్చి 29: మండలకేంద్రంలోని సాకడ క్రాస్‌రోడ్డులో శుక్రవారం ఏఎస్సై బాల్‌సింగ్ ఆధ్వ ర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాలను తని ఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్-ఆది లాబాద్ ప్రధానరహదారి, అలాగే సాంగ్వీ, మహా రాష్ట్రలోని జివితికి వెళ్లే ద్విచక్ర వవాహన దారులను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నేడు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

సిర్పూర్(టి), మార్చి 29: మండల కేంద్రంలోని ఎంపీ డీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ సువర్ణపై అవిశ్వాస తీర్మాన సమావేశం ఉందని కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌కుమార్ సభ్యులకు నోటీ సులు జారీచేశారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు



ఖర్జూరం తినిపిస్తున్న జోగురామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 29 : బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు, ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఖర్జురాలు తిని ఉపవాస దీక్షలను విరమించారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్‌విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తోఫాను కూడా అందజేసిందన్నారు.ఆర్థికంగా ప్రతి ఒక్కరి కుటుంబాల్లో రంజాన్ పండుగ జరుపుకునేలా ప్రోత్సహించిందని, మైనార్టీ సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ చేసిన ఎంతో ఉందని తెలిపారు. మైనార్టీలు విద్యాపరంగా ఉన్నత స్థానంలో ఉండేలామైనార్టీ గురుకులాలను సైతం ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ అన్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్, వైస్‌చైర్మన్ జహీర్‌రంజాని, సాజిదొద్దిన్, యూనిస్‌అక్బాని, అశ్రాఫ్, సలీం, ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

● ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

జైనూర్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ సీటు తప్పక బీఆర్ఎస్ గెలిచి తీరుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని పార గ్రామంలో శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే బాగుండేదని ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. వచ్చే మరి కొద్దిరోజుల్లో గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు బీఆర్ఎస్ చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ సీటును సునాయాసంగా కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, యాదవ్‌రావ్, ఊర్వేత ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 29: బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం పర్సనంబాల గ్రామంలో బాల్యవివాహం జరిపిస్తున్నారని సమాచారం అందడంతో సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకొని వివాహాన్ని నిలిపివేయించారు. ఈ సందర్భంగా అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వలన కలిగే నష్టాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతికి 18సంవత్సరాల వయస్సు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. ముందుగా చేస్తే ఆరోగ్య సమ స్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. దీంతో 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత వివాహం జరిపిం చేందుకు ఇద్దరి తల్లిదండ్రులు అంగీకరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్యలక్ష్మి, సీడీపీవో సాదియా రుక్సానా, బాలికల సంరక్షణాధికారి మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

జోడేఘాట్‌ను సందర్శించిన విద్యార్థులు



జోడేఘాట్‌ను సందర్శిస్తున్న పెంచికలపేట జడ్పీ విద్యార్థులు

పెంచికలపేట, మార్చి 29: పెంచికలపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం పీఎంశ్రీ విద్యా వైజ్ఞానిక యాత్రలో భాగంగా కెరమెరి మండలం జోడేఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భీం విగ్రహంతో పాటు మ్యూజియం, ఆర్చీలు సందర్శించి కుమరంభీం పోరాట పటిమను తెలుసుకున్నారు. గిరిజనుల జీవన విధానం, వారు వాడిన వస్తువుల ప్రాముఖ్యతను వివరించారు.

రేపు మంత్రి సీతక్క పర్యటన

కౌటాల, మార్చి 29: పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో మండల కేంద్రంలో ఈనెల31న నిర్వ హించే కార్యకర్తల సమావేశానికి మంత్రి సీతక్క రానున్నట్లు మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలి పారు. సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరవుతారని, అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జుతోపాటు ముఖ్య నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు మాజీఎమ్మెల్యే కోనప్పతోపాటు జడ్పీ చైర్మన్ కోనేరుకృష్ణారావు, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్ర మంలో ఎంపీటీసీ మనీష్, మాజీ సర్పంచ్ మౌనీష్, నాయకులు రాజేశ్వర్, ప్రకాష్, విలాస్‌గౌడ్, నాజీం హుస్సేన్ ఏర్పాట్లను పరిశీలించారు.





హామీల.. గండం!

- గడిచిన ఐదేళ్లలో అమలుకు నోచుకోని హామీలు
- ప్రధాని మోదీ పర్యటనతోనైనా కనిపించని భరోసా
- మళ్లీ తెరపైకి వస్తున్న ఆదివాసీల ఉద్యమం
- కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న ప్రతిపక్షాల నాయకులు
- జిల్లా రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్న రాజకీయ పరిణామాలు
- సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికలు



ఆదిలాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్న కమలం పార్టీకి హామీల గండం పట్టుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీ సిట్టింగ్ స్థానాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ఆరాట పడుతున్న బీజేపీని హామీల గుబులు వెంటాడుతోంది. గడిచిన ఐదేళ్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించక పోవడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందంటున్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆశించినా.. ఆచరణలో సాధ్యం కాలేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మళ్లీ లోక్‌సభ ఎన్నికలు రావడంతో నేతలు ప్రచారం బాట పడుతున్నారు. ఈసారి కూడా ప్రధాన సమస్యలనే ప్రచార అస్త్రాలుగా చేసుకొని ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే గతంలో ఇచ్చిన హామీలను లేవనెత్తగానే నేతలు నీళ్లు మింగుతున్నట్లు తెలుస్తుంది. దీంతో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమేనని ఎన్నికలు పూర్తికాగానే నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామంటూ బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో ముఖ్యంగా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎరోడ్రమ్ నిర్మాణం, గిరిజన యూనివర్సిటీ, కేంద్రీయ విశ్వ విద్యాలయం, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం పనుల్లో పురోగతి కనిపించడం లేదు. గతంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, మోదీ పేరును తలుచుకుంటూ నేతలు ప్రసంగాలు చేయడం కనిపిస్తుందంటున్నారు. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మళ్లీ అధికారంలోకి వస్తే అభివృద్ధి చేసి చూపుతామంటూ చెబుతున్న బీజేపీ నేతలను.. గడిచిన ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో? చెప్పాలంటూ ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

భరోసా ఏదీ!?

ప్రధాని మోదీ పర్యటనతో జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అందరు భావించిన ఫలితం లేకుండా పోయింది. ప్రధాని వాటి ఊసే ఎత్తకపోవడంతో జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాగే అభివృద్ధి పనుల జోలికి కూడా వెళ్లినట్లు కనిపించ లేదు. గతంలో మంజూరైన బోరజ్ టూ బేల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం తప్ప.. కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీ అభ్యర్థి ఎంపీగా గెలుపొందిన జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యపడలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. వచ్చినట్లే వచ్చి చేజారిపోయిన గిరిజన యూనివర్సిటీపై ఆదివాసీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎరోడ్రమ్ నిర్మాణం, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణంపై ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని ఆశించిన జిల్లా సమస్యల జోలికి వెళ్లినట్లే కనిపించ లేదు. బహిరంగ సభ వేదికపైననే సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల శంకర్ జిల్లా సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన స్పందించినట్లే కనిపించ లేదు. స్థానిక సమస్యల జోలికి వెళ్లకుండానే జాతీయ అంశాలతో మోదీ తన ప్రసంగాన్ని ముగించడంపై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మొత్తానికి మోదీ పర్యటనపై జిల్లావాసుల అంచనాలు తారుమారయ్యాయి.

పట్టుబడుతున్న ఆదివాసీలు

ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలంటూ డిమాండ్ చేస్తూ ఆదివాసీలు మళ్లీ పట్టుబడుతున్నారు. గత ఐదారేళ్లుగా కొనసాగుతున్న ఆదివాసీల ఉద్యమాన్ని తెరపైకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆదివాసీలకు అండగా నిలిచిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. గత ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఉద్యమ నేత కావడంతో ఆదివాసీలు బీజేపీకి అండగా నిలిచారు. దీంతో ఆయన గెలుపు ఖాయమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ఆదివాసీలే కావడంతో ఎవరికి అండగా నిలుస్తారో? అర్థంకాని పరిస్థితి కనిపిస్తుంది. ఆదివాసీ ఉద్యమానికి అండగా నిలిస్తే లంబాడా సామాజికవర్గం నుంచి వ్యతిరేకత వస్తుందన్న అభిప్రాయంతో అన్ని పార్టీల అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తుంది. కానీ ఎన్నికలు సమీపించడంతో ఉద్యమాన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చేందుకు కొంతమంది నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో పలుమార్లు ఆదివాసీల డిమాండ్లను ఎంపీ సోయం బాపురావు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. సానుకూలమైన స్పందన కనిపించ లేదు. దీంతో కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ప్రధాన పార్టీలన్నీ లంబాడా సామాజికవర్గానికి చెందిన నేతలను పక్కన పెట్టడంతో ఆ వర్గం నేతల్లోనూ తీవ్ర అసంతృప్తి కనిపిస్తుంది.

ప్రతిపక్షాల ఎదురుదాడి

గడచిన ఐదేళ్లలో బీజేపీ చేపట్టిన అభివృద్ధిని నిలదీస్తూ ప్రతిపక్షాలు ఎదురుదాడికి దిగుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అభ్యర్థినే గెలిపించినా.. ప్రయోజనం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్లమెంట్ పరిధిలో ఎక్కడా హామీలు నెరవేరకపోవడంతో వాటినే ప్రచార అస్త్రాలుగా మలుచుకుంటూ ప్రచారంలో ముందుకెళుతున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామంటూ బీజేపీ నేతలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఆదిలాబాద్‌కు ఫిట్‌లైన్, తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జి, స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని ప్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభమైన ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. స్థానికంగా అడ్డంకులు ఏర్పడుతున్న పరిష్కార మార్గం చూపడం లేదంటున్నారు. మరోసారి అధికారాన్ని కట్టబెడితే మిగిలిన హామీలన్నింటినీ పూర్తి చేస్తామని కమలం పార్టీ నేతలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సిట్టింగ్ ఎంపీకి టికెట్ ఎందుకు ఇవ్వలేదో? బీజేపీ చెప్పాలంటూ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను మళ్లీ ప్రతిపక్షాలు ప్రజల ముందుకు తీసుకొస్తున్నాయి.



బీజేపీ జాతీయ అధ్యక్షుడితో ఎంపీ సోయం బాపురావు

ఎంపీకి నామినేటెడ్ పోస్టు : జేపీ నడ్డా

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 29: ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను శుక్రవారం ఎంపీ సోయం బాపురావు మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిలో భాగంగా సమయం కేటాయించిన జేపీ నడ్డా ఎంపీ సోయంతో మాట్లాడుతూ తప్పకుండా న్యాయం చేస్తామని, కేంద్రం స్థాయిలో నామినేటెడ్ పోస్టు ఇస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజవర్గంతో, ఇతర విషయాలపై చర్చించారు. ఇందులో ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ నందిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

ఇచ్చోడ, మార్చి 29: ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే వైద్యాధికారితో పాటు వైద్య సిబ్బంది 24గంటలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. శుక్రవారం ఆమె ఆకస్మికంగా పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. రాత్రుల్లో ఆసుపత్రికి వచ్చే ఎమర్జెన్సీ కేసుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. రాత్రి సమయంలో రోగులు వస్తే వైద్యులు లేరని తింపి పంపుతున్నారని విమర్శలు వస్తున్నాయని, ఇలాంటి సంఘటనలు పునారావృతం కావొద్దని వైద్య సిబ్బందికి హెచ్చరించారు. కాగా, ఆసుపత్రిలో తగిన సిబ్బంది లేకపోవడంతో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఆసుపత్రికి వాచ్‌మెన్ లేని కారణంగానే రాత్రుల్లో మహిళా సిబ్బంది డ్యూటీలో ఉండడంతో సెక్యూరిటీ కోసం ఆసుపత్రి భవనానికి తలుపులు మూసివేసి ఉంచడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి సమస్యలు తలెత్తకుండా వాట్సాప్ గ్రూప్‌లో నిరంతరం డ్యూటీ సిబ్బంది వివరాలు నమోదు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఆమె తెలిపారు. 24 గంటలు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ వైద్యాధికారి ప్రతాప్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



తాంసి(కె)లో మధ్యాహ్నం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న కూలీలు

మండుటెండల్లో ఉపాధి పనులు!!

- ఏమీ సూచనలు చేయని ఈజీఎస్ అధికారులు, సిబ్బంది

భీంపూర్, మార్చి 29: అంతటా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 11దాటితే బయటకి వెళ్లడానికి భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో ఉపాధి హామీ పనులను కూలీలు పట్టపగలు కూడా చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నిజానికి నిబంధనల ప్రకారం ఎండాకాలం కూలీలు పనులు పూర్తి చేసి 11 గంటల లోపే ఇళ్లకు చేరుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ విషయంలో స్థానిక ఈజీఎస్ అధికారులు, సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించలేకపోతున్నారు. అలాగే పని ప్రదేశాలలో నీడ కోసం టెంట్లు వేయటం, తాగునీటి సౌకర్యం, ప్రాథమిక వైద్యం కోసం మందులు అందుబాటులో లేనే లేవు. దీంతో భయంకరమైన ఎండల తీవ్రతో కూలీలకు ఏమైనా జరిగితే అధికారులు ఏమి సమాధానం చెబుతారు అని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ అధికారులు ఎండల తీవ్రత దృష్ట్యా పని సమయాల గురించి కూలీలకు సూచనలు చేస్తే బాగుంటుంది.

'ఎంపీగా గెలిపించాలి'

ఇంద్రవెల్లి, మార్చి 29: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు నిరంతరం ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందులో సోమోరే నాగోరావు, గాయక్‌వాడ్, రాందాస్, సోన్ కాంబ్లే నవీన్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త సమాచారం



సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

'బోథ్ సమస్యలు పరిష్కరించాలి'

బోథ్, మార్చి 29: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ కురుమ మహేందర్ విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గకేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించారని ముఖ్యమంత్రికి విన్నవించారు. అంతేకాక నియోజకవర్గకేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, విద్యార్థుల కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇందులో పద్మశాలీ సంఘ అధ్యక్షుడు మెరుగు భోజన, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బారే నాగేందర్, పద్మశాలీ సంఘం మండల ఉపాధ్యక్షుడు ఆడెపు కిరణ్, నిగిని ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

నిలదొక్కుకుంటాం : రాజారెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 29: ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకొని మళ్లీ నిలదొక్కుకుంటామని టీడీపీ జిల్లా నాయకులు అల్లూరి రాజారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల సంక్షేమం కోసం 1982లో పార్టీని స్థాపించి 9నెలల కాలంలో అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌దని రాజారెడ్డి అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి పేదలకు అండగా నిలిచిన పార్టీ టీడీపీ అని తెలిపారు. ఎన్ని ఆటుపోట్లనైనా తట్టుకొని.. మళ్లీ నిలదొక్కుకుని అధికారం చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫీక్, నాగన్న, సుభాష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ టవర్లను సరిచేయాలి'

ఇచ్చోడ, మార్చి 29: ఇచ్చోడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పక్కనే ఆనుకొని ఉన్న విద్యుత్తు టవర్లను మధ్య రోడ్డు నుంచి 50 ఫీట్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలని, త్వరలోనే రహదారి పనులు ప్రారంభమవుతాయని ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య అన్నారు. శుక్రవారం ఆర్అండ్‌బీ ఈఈతో పాటు విద్యుత్ శాఖ ఈఈ జీఆర్ చౌహాన్‌లు స్థానిక జీసీసీ గొడౌన్, తదితర ప్రాంతాల్లో ఉన్న విద్యుత్తు టవర్లను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్నవాటిని తొలగించి మరోచోట బిగించాలన్నారు. డీఈ హరికృష్ణ, ఏఈ రాజు, గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్ తదితరులు న్నారు.



ఇచ్చోడలో పరిశీలిస్తున్న ఆయా శాఖల అధికారులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

- జిల్లావ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన క్రైస్తవులు
- పలుచోట్ల ఏసుప్రభు శిలువతో యాత్ర



ఆదిలాబాద్‌లో శిలువలతో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు



ఉట్నూర్ నుంచి కలవరి గుట్టకు శిలువతో ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 29: గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాకేంద్రంలోని సీఎస్ఐ చర్చితో పాటు పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. ఈ సందర్భంగా శిలువ యాత్ర నిర్వహించారు. ఏసుక్రీస్తు వేషాధారణలో శిలాన్ని మోస్తూ గుడ్‌ఫ్రైడే ఘట్టాన్ని వివరించారు.

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉట్నూర్‌లోని సీఎస్ఐ చర్చిలో శుభ శుక్రవారం సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ బి.కుమార్ ప్రసంగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కొమ్ము బాపురావు, టీపీ దాస్, సముద్రాల జాన్, ఎల్లమల మనోహర్, నక్క శాంక్సన్, హిమందర్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా క్యాథలిక్ చర్చి నిర్వాహకులు ఉట్నూర్ నుంచి కొత్తగూడ గ్రామ సమీపంలో ఉన్న గుట్టను కలవరి గుట్టగా నామకరణం చేసుకొని అక్కడి వరకు శిలువతో ర్యాలీ నిర్వహించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. భక్తులు యేసుక్రీస్తు సిలువ మార్గంను మోస్తూ ప్రార్థనలు నిర్వహించారు.

తాంసి: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని క్రైస్తవులు సెయింట్ థామస్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఫాదర్ జోమోన్‌జార్జి ఏసు జీవిత చరిత్రను వివరించారు. ఇందులో సిస్టర్స్ సామిప్య, అమాలియ, శ్రీకాంత్, వినోద్, మనోజ్, థామస్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో ఏసుక్రీస్తు శిలువ మార్గంను మోస్తూ ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



తాంసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

'కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

జైనథ్, మార్చి 29: జైనథ్ మండలం కేంద్రంలో గల స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని జైనథ్, బేల మండలాల శనగ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా సహకార అధికారి బి.మోహన్ అన్నారు. శుక్రవారం జైనథ్ మార్కెట్ ఆవరణలో నాఫెడ్‌మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జైనథ్ పీఎస్ఎస్ ద్వారా చేపట్టి శనగ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ పంటకు క్వింటాల్‌కు రూ.5440 మద్దతు ధర ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అసిస్టెంట్ అధి కారి ఆత్మరాం, జైనథ్ సహకార సంఘం సీఈవో జి.గంగన్న, జైనథ్ మార్కెట్ కె.మధుకర్, కొను గోలు ప్రత్యేక అధికారి సత్యనారాయణ, సొసైటీ కార్యదర్శి సుశీల్‌కుమార్, ఆఫీస్ అసిస్టెంట్ ప్రశాంత్‌లతో పాటు సొసైటీ సిబ్బందితో పాటు జైనథ్, బేల మండలాల శనగ రైతులు పాల్గొన్నారు. అంతకు ముందు ఈ సందర్భంగా శనగ రైతులు మిఠాయిలు తినిపించి శాలువాతో సన్మానించారు.

కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద రూ.99 వేలు పట్టివేత

ఉట్నూర్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ బృందం అధికారులు వాహనం తనిఖీ చేయగా రూ.99 వేలు పట్టుకున్నారు.జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గంలోని కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నిఘా అధికారులు సోరాజి, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్, చరణ్‌దాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి ఉట్నూర్ వస్తున్నా వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద రూ.99వేలు లభించడంతో ఉన్నత అధికారులకు సమాచారం అందించారు. ఉట్నూర్ సీఐ గండి కోట మొగిలి,ఎస్సై మనోహర్‌లు అక్కడికి చేరుకుని రూ.99వేలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వాహన యజమానులు తాము కరీంనగర్‌లో మేకలు విక్రయించుకొని ఆ డబ్బుతో తిరిగి వస్తున్నామని, తమకు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని వివరించడంతో ఎన్నికల సమయంలో ఎవరు కూడా భారీ మొత్తంలో నగదు వెంటబెట్టుకొని వెళ్లవద్దని సూచించినట్లు సీఐ పేర్కొన్నారు.



కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద రూ.99 వేలు పట్టుకున్న ఎస్ఎస్‌టీ అధికారులు

